క్లుప్తంగా

బానోత్ జాలంసింగ్ సేవలు మరువలేనివి

నార్నూర్: గిరిజనుల అభివృద్ధికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి బానోత్ జాలంసింగ్ సేవలు మరువలేనివని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. మూడో వర్ధంతి కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని బానోత్ జాలంసింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 30 ఏళ్లు సర్పంచ్‌గా నార్నూర్ గ్రామంతో పాటు మండల అభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు. అన్నివర్గాల ప్రజల శ్రేయస్సు కోసం పని చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవ సంఘం జిల్లా అధ్యక్షుడు జాదవ్ రెడ్డినాయక్, పీఏసీఎస్ చైర్మన్ అడే సురేశ్, వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, రితేష్ రాథోడ్, దేవిదాస్ పవార్, నారాయణ్ నాయక్, షేక్ దాదే అలీ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సేవలు అందించాలి

నేరడిగొండ: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కార్యకర్తలు లబ్ధిదారులకు సేవలు అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. శనివారం మండలంలోని దేవుల్‌తండా, గుత్పాల గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రీస్కూల్, ప్రగతి, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న ఆరోగ్య లక్ష్మి పథకాల గురించి వివరించాలని సూచించారు. కిషోర బాలికలు, గర్భిణులుకు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలన్నారు. సమయపాలనకు అంగన్‌వాడీ కేంద్రాలను తెరవాలన్నారు.

'మహాలక్ష్మి పథకం రద్దు చేయాలి'

ఇచ్చోడ: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని వెంటనే రద్దు చేయాలని ప్రైవేట్ ఓనర్స్, డ్రైవర్స్ అసోషియన్ అధ్యక్షుడు పాషా డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. మహిలక్ష్మి పథకం ద్వారా మహిళలు ఆర్టీసీ బస్సులలో ప్రయాణిస్తున్నారన్నారు. దీంతో ప్రైవేట్ వాహనాలకు గిరాకి లేక తాము ఉపాధి కోల్పోతున్నామన్నారు. ఉపాధి కోసం అప్పులు చేసి వాహనాలను కొనుగోలు చేశామని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఈఎంఐలు కట్టలేని పరిస్థితి నెలకొందన్నారు. రాస్తారోకోలో సంఘం నాయకులు చాహకటి కృష్ణ, రమేశ్, లక్ష్మణ్, దత్తు, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేయాలి

కైలాస్‌నగర్: జిల్లాలోని జైనథ్, బేల మండలాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి అన్నారు. శనివారం ఆర్డీవో స్రవంతికి వినతిపత్రం అందజేశారు. గ్యాస్ కనెక్షన్స్‌కు ఈ–కేవైసీ, ఆధార్ అప్‌డేషన్ కోసం ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. జైనథ్, బేల మండలాల ప్రజలు ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి రావాల్సి వస్తుందన్నారు. ఆయా మండలాల్లో శాశ్వత ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పోతారెడ్డి, విపిన్ ఠాక్రే, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి

బోథ్: విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని సాంఘిక సంక్షేమ గురుకులాల రీజనల్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపరాణి అన్నారు. శనివారం టీఎస్‌డబ్ల్యూఎస్ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తాం

నేరడిగొండ: పాఠశాలల్లో ఏ సమస్యలున్నా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని, విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎంఈవో భూమారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను సందర్శించారు. 'ఉపాధ్యాయుడి వెకిలిచేష్టలు.. విద్యార్థుల ఆందోళన' అనే కథనం 'సాక్షి'లో ప్రచురితం కావడంతో స్పందించారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మను, విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చక్కగా చదివి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. పిల్లల పోషకులు పాఠశాలకు హాజరు కాగా, వారికి నచ్చజెప్పారు. సమావేశంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఏలేటి మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

సన్మానం

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) రాష్ట్ర కార్యనిర్వాహణ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన గోడం గణేష్‌ను తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు జగదీష్ అగర్వాల్ శనివారం సన్మానించారు. ఆదివాసీల హక్కుల కోసం నిరంతరం ఉద్యమించాలని కోరారు. నాయకులు దేవేందర్, మనోజ్, నాగోరావ్, పాల్గొన్నారు.

ప్రశాంతధామం.. చపరాడ ఆలయం!


ఆలయంలోని దుర్గాదేవి విగ్రహం


ఆలయంలోని హనుమాన్ మూల విరాట్


చపరాడ హనుమాన్ మందిరం

చింతలమానెపల్లి: ప్రశాంతమైన వాతావరణం.. పచ్చని ప్రకృతితో ఆహ్లాదాన్నిచ్చే పరిసరాలు.. మనసును మైమరిపింపజేసే చపరాడ హనుమాన్ ఆలయం కౌటాల మండలంలోని తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదికి అవతలివైపు ఉంది. భౌగోళికంగా మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా చౌడంపల్లి గ్రామపంచాయతీ పరిధి చపరాడ గ్రామ శివారులోని అటవీప్రాంతంలో ఈ ఆలయం ఉంది. వార్ధా, పెన్‌గంగ సంగమ స్థలంలో ఆలయం ఉండడంతో పవిత్ర పుణ్య క్షేత్రంగా భక్తులు కొలుస్తుంటారు.

ఘనంగా పూజలు..

ఇక్కడ హనుమాన్ విగ్రహం స్వయంభూగా వెలిసినట్లుగా స్థానికులు చెబుతుంటారు. ఆలయాన్ని సాధుసంత్ శ్రీ కార్తీక్ మహారాజ్ నిర్మించారు. హనుమాన్ ఆలయంతో పాటు పలు హిందూ దేవతల ఆలయాలు సైతం ఇక్కడ ఉన్నాయి. ప్రతి ఏడాది కార్తీక పౌర్ణమి, హనుమాన్ జయంతి, శ్రీరామనవమి, శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. ప్రతిరోజు ఉదయం నిర్వహించే హారతికి భక్తులు పూజలు చేస్తారు. ఇక్కడికి చేరుకోవాలంటే కాగజ్‌నగర్ నుంచి రోడ్డు మార్గంలో సిర్పూర్(టి), మహారాష్ట్రలోని ఆష్టి మీదుగా 75 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. బెజ్జూర్ వైపు నుంచి భక్తులు చింతలమానెపల్లి మండలంలోని గూడెం మీదుగా అహేరి మీదుగా చేరుకోవచ్చు. భక్తులు ఆరాధనీయంగా భావించే కార్తీక్ మహారాజ్ పరమపదించిన అనంతరం ఆలయంలోనే ఆయనకు మహాసమాధి నిర్వహించి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయం నిర్మించారు.


కార్తీక్ మహారాజ్ సమాధి


ఉత్సవాలు నిర్వహిస్తున్న భక్తులు(ఫైల్)

సామాజిక తనిఖీ సిబ్బందికి సహకరించాలి


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

దహెగాం: ఉపాధిహామీ పథకంలో చేసిన పనులపై సామాజిక తనిఖీ బృందం మండలంలో త్వరలో పర్యటించనున్నట్లు, ఈజీఎస్ సిబ్బంది వారికి సహకరించాలని ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని ఈజీఎస్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. ఉపాధి పనుల ఎంబీ రికార్డులు, మస్టర్లు, జాబ్‌కార్డుల వివరాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సమావేశంలో ఈజీఎస్ ఏపీవో కల్పన, సిబ్బంది ఉన్నారు.

'బాధితులకు అండగా ఉంటాం'


పరామర్శిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కౌటాల: బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గుండెపోటుతో మృతి చెందిన బీఎస్పీ మండల నాయకులు రత్నం బావుజీ మృతదేహానికి శుక్రవారం రాత్రి ఆయన నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. యాపలగూడ గ్రామానికి చెందిన దుర్గబాయి అనారోగ్యంతో మృతి చెందగా ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. కాగా శనివారం బావుజీ మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి నివాళులర్పించారు.

ఎమ్మార్పీఎస్ చలో ఢిల్లీ విజయవంతం చేయండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హక్కుల సాధన కోసం ఈనెల 21వ తేదీన ఢిల్లీలో నిర్వహించే మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల రవి కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఈనెల 21వ తేదీన ఢిల్లీలో నిర్వహించే మహా ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. మాదిగ, మాదిగ ఉపకులాలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ధర్మయ్య, మల్లేష్, సుకుదేవ్, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణలోని అంశాలను విద్యార్థులకు బోధించాలి

కెరమెరి: రెండు రోజులుగా శిక్షణలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు బోధించాలని ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్ అన్నారు. మండలంలోని ఝరి ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులకు రెండు రోజులుగా నిర్వహించిన పాఠశాల సముదాయ సమావేశం శనివారం ముగిసింది. ఆయన మాట్లాడుతూ అన్ని సబ్జెక్టులపై రెండు రోజుల్లో ఆర్పీలు అన్ని విషయాలను క్లుప్తంగా వివరించాలన్నారు. రికార్డులు నమోదు చేయాలని, ఎఫ్ఆర్ఎస్‌లో విద్యార్థుల హాజరు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, ఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆడే ప్రకాశ్

సేవా దృక్పథంతో విధులు నిర్వర్తించాలి

- ఎంపీపీ ముండె విమలాబాయి
- సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ విమలాబాయి

వాంకిడి: అధికారులు,ప్రజాప్రతినిధులు ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి సేవా దృక్పథంతో విధులు నిర్వర్తించాలని ఎంపీపీ ముండె విమలాబాయి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖ నివేదికతో ప్రారంభమైన సమావేశం వరుసగా విద్యాశాఖ, గ్రామీణ నీటి సరఫరాల శాఖ, ఐటీడీఏ, ఆరోగ్యవైద్య శాఖ, ఐసీడీఎస్, ఐకేపీ, ఈజీఎస్, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖ మొత్తం 11 శాఖల నివేదికలపై చర్చ జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ రైతులు పంట మార్పిడి అవలంభించి కాలానుగుణంగా ఏడాదికి మూడు రకాల పంటలు సాగు చేయాలని సూచించారు. అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ శాఖలపై ఆగ్రహం..

గ్రామీణ నీటి పారుదల, చిన్ననీటి వనరుల శాఖల అధికారులు అవలంభిస్తున్న తీరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శైలేందర్ శాఖాపరమైన అభివృద్ధి పనులను వివరించగా ఏఏ గ్రామాల్లో పూర్తి స్థాయిలో మిషన్ భగీరథ నీటి సరఫర జరుగుతుందో తెలపాలని ఖమాన ఎంపీటీసీ ప్రవీణ్ నిలదీశారు. ఖమాన గ్రామంలో కొన్ని వాడల్లో ఇప్పటికీ మిషన్ భగీరథ నీరు సరఫరా కాలేదన్నారు. ప్రతీసారి ఏదో ఒక సమాధానం చెప్పి తప్పించుకుంటున్నారు కాని పనులు చేపట్టడం లేదని ఆగ్రహించారు. ఏఈ శైలేందర్ రెండు రోజుల్లో మరమ్మతులు చేపించి నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఇరిగేషన్ శాఖ తరఫున ఏఈ షేక్ జానీ నివేదికను వివరిస్తుండగా వాంకిడి సర్పంచ్ నార్లాపూర్ చెరువు ప్రస్తావన తీసుకొచ్చారు. చెరువు నుంచి వచ్చే కాలువ ఎక్కడి వరకు పూర్తి చేశారని ఏఈని ప్రశ్నించారు. కాలువను ఓ రైతు పొలం వరకు నిర్మించి అసంపూర్తిగా వదిలేయడంతో రైతు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

చర్యలు తీసుకోవాలని కోరగా.. ఆ ప్రాంతాన్ని సందర్శించి సమస్య పరిష్కరిస్తామని ఏఈ తెలిపారు. మండలంలోని ఖమాన గ్రామానికి వెళ్లే రహదారి నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై ఎంపీటీసీ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. గత 6 నెలలుగా రహదారి నిర్మాణంలో సదరు కాంట్రాక్టర్ చేస్తున్న జాప్యంతో 30 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందని, ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదని పంచాయతీ రాజ్ ఏఈ స్టీవెన్ దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీపీ స్పందించి కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి వెంటనే పనులు ప్రారంభించాలని హెచ్చరించారు. పనుల్లో జరుగుతున్న జాప్యంపై గుత్తేదారుకు నోటీసులు పంపామని త్వరగా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ఏఈ పేర్కొన్నారు. కాగా ఈ సమావేశానికి హాజరైన సభ్యుల్లో ఖమాన ఎంపీటీసీ ప్రవీణ్, వాంకిడి సర్పంచ్ తుకారాం మినహా మిగతావారు ఎలాంటి సమస్యలను ప్రస్తావించకపోవడం గమనార్హం. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ రాజ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ జబోరె పెంటు, ఎంపీవో శివకుమార్, ఏవో మిలింద్ కుమార్, ఎంఈవో మనుకుమార్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

'ఎన్నికల్లో టీఎన్‌టీయూసీని గెలిపించండి'


మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి మణిరాం సింగ్

రెబ్బెన: త్వరలో జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులు టీఎన్‌టీయూసీని గెలిపించాలని టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి టి. మణిరాంసింగ్ అన్నారు. శనివారం గోలేటిలోని సివిల్ డిపార్టుమెంట్ కార్యాలయంలో టీఎన్‌టీయూసీ గేట్ మీటింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హక్కులు, సౌకర్యాలు, ఉపాధి కల్పనను కల్పతరువుగా ఉండే సింగరేణి సంస్కరణల పుణ్యమా అని ఉద్యోగాలు ఊడిపోతున్నాయన్నారు. హక్కుల కోసం కార్మికుల ముందుండి నడవాల్సిన జాతీయ సంఘాలు యాజమాన్యం కనుసన్నల్లో చేరాయని పేర్కొన్నారు. కార్మిక హక్కులు, సమస్యలపై పోరాడే టీఎన్‌టీయూసీకి కార్మికులు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు. సమావేశంలో నాయకులు మల్లయ్య, గంగయ్య, యాదగిరి, బాలయ్య, ఎండీ హసన్, సుభాన్, శంకరయ్య, థాయిర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

'సింగరేణి కార్మికుల సొంతింటి కల నెరవేరుస్తాం'

రెబ్బెన: ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా గెలిచిన వెంటనే సింగరేణి కార్మికుల సొంతింటి కల నెరవేరుస్తామని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి అన్నారు. శనివారం బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి వర్క్‌షాప్, ఏరియా స్టోర్స్‌లలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ సింగరేణి కార్మికులు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న సొంతింటి కల ఏఐటీయూసీతోనే సాధ్యమవుతుందన్నారు. బీఆర్ఎస్ అనుబంధ సంఘం టీబీజీకేఎస్ మూలంగా సింగరేణిలో మితిమీరిన రాజకీయ జోక్యం పెరిగి సంస్థ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. బ్రాంచి ఉపాధ్యక్షుడు మొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు చంద్రశేఖర్, ఆనంద్, పిట్ కార్యదర్శులు అశోక్, మాజీ పిట్ కార్యదర్శి నరసింహస్వామి, నాయకులు శంకర్, వేణు, సత్యనారాయణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య

'టీబీజీకేఎస్ కృషితో ఎన్నో హక్కులు'


మాట్లాడుతున్న ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు

రెబ్బెన: టీబీజీకేఎస్ కృషి ఫలితంగా సింగరేణి కార్మికులకు ఎన్నో చారిత్రాత్మక హక్కులు వచ్చాయని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం ఏరియాలోని కైరిగూడలో గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేసీఆర్ కృషి ఫలితంగా కోల్ ఇండియాలో లేని హక్కులతో పాటు కార్మికులు ఊహించని ఎన్నో హక్కులు సింగరేణి కార్మికులకు దక్కాయన్నారు. తల్లిదండ్రుల ఉద్యోగాన్ని వారసులకు ఇప్పించటంతో పాటు తల్లిదండ్రులకు కార్పొరేట్ వైద్యం, ఉచిత విద్యుత్, ఇంక్రిమెంట్, సకల జనుల సమ్మె కాలానికి వేతనాలు అందించిన ఘనత టీబీజీకేఎస్‌దన్నారు. జాతీయ సంఘాలు చెప్పే మాటలు నమ్మకుండా కార్మికులకు అందుబాటులో ఉండే టీబీజీకేఎస్‌ను గెలిపించాలని కోరారు. సెంట్రల్ కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రకాశ్‌రావు, 11మెన్ కమిటీ సభ్యులు మంగీలాల్, మాజీ ఏరియా ఉపాధ్యక్షుడు నల్లగొండ సదాశివ్, ఏరియా కార్యదర్శి సంపత్ రావు, నాయకులు చంద్రశేఖర్, వెంకటేష్, శ్రీనివాస్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'కార్మిక సమస్యలపై పోరాడే హెచ్‌ఎంఎస్‌ను ఆదరించండి'



మాట్లాడుతున్న ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు

రెబ్బెన: కార్మిక సమస్యలపై నిరంతరం పోరాడే హెచ్‌ఎంఎస్‌ను కార్మికులు ఆదరించాలని హెచ్‌ఎంఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు అన్నారు. ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 27న జరగనున్న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులంతా తరాజు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సారి కార్మికులు హెచ్‌ఎంఎస్‌కు అవకాశం ఇచ్చి హెచ్‌ఎంఎస్ పనితీరు చూడాలన్నారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్, ఉమామహేశ్వర్, ఆర్.శ్రీనివాస్, దత్తు, వేణుగోపాల్, కార్తీక్, ఓంకార్, దశరతం, భిక్షపతి, బాలేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి


విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలిస్తున్న విజయరాణి

రెబ్బెన: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని రెబ్బెన కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు విజయరాణి అన్నారు. శనివారం మండలంలోని లేతన్‌గూడ ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మౌళిక భాషా గణిత సామర్థ్యాల సాధన కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. బోధనాభ్యసన కార్యక్రమంపై ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, సీఆర్పీ దేవేందర్, ఉపాధ్యాయులు సాయికృష్ణ పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ

కాగజ్‌నగర్‌టౌన్: టీఎస్‌యూటీఎఫ్ కాగజ్‌నగర్ మండల నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మహిపాల్, ప్రధాన కార్యదర్శిగా పి.బాలకృష్ణ, ఉపాధ్యక్షులుగా నరేష్ కుమార్, వర్ష కోశాధికారిగా డి.శివానంద్‌లను ఎన్నుకున్నట్లు జిల్లా కమిటీ పదాధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యదర్శులుగా ఆరుగురు, ఆడిట్ కమిటీ, మహిళా కమిటీ, కల్చరల్ కమిటీ, వాయిస్ ఆఫ్ తెలంగాణ, అకాడమిక్ కమిటీ కన్వీనర్లు, కో కన్వీనర్లను ఎన్నుకున్నట్లు వెల్లడించారు.